క్లుప్తంగా

వేదసంరక్షణకు శారదా పీఠం కృషి



విజయవాడకల్చరల్: వేద సంరక్షణకు శృంగేరీ శారదాపీఠం కట్టుబడి ఉందని శివరామ కృష్ణ క్షేత్రం ధర్మాధికారి ఎస్.హనుమత్‌ప్రసాద్ అన్నారు. శృంగేరీ పీఠపాలిత శివరామకృష్ణ క్షేత్రంలో జగద్గురు భారతీ తీర్థ మహాస్వామి 75 వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం పలు కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమత్‌ప్రసాద్ మాట్లాడుతూ భారతీతీర్థ స్వామి తన ప్రసంగాల ద్వారా ఎందరినో ప్రభావితం చేస్తునట్లు తెలిపారు. ఆధ్యాత్మిక కార్యక్రమంలో భాగంగా శ్రీపాద సుబ్రహ్మమణ్యం మార్కండేయ పురాణంలోని విశేషాలను వివరించారు.

క్రెడాయ్ నగర శాఖ కార్యవర్గం ఎన్నిక



లబ్బీపేట(విజయవాడతూర్పు): క్రెడాయ్ నగర శాఖ 2025–27 సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. గురునానక్‌కాలనీలోని ఓ కల్యాణ మండపంలో జరిగిన ఎన్నికల్లో నూతన కార్యవర్గం చైర్మన్‌గా చెరుకూరి సతీష్, అధ్యక్షుడిగా జి.రామ్మోహనరావు, ఉపాధ్యక్షులుగా బి.పవన్‌కుమార్, కె.రమేష్ అంకినీడు, శివన్నారాయణ ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా కె.రఘురాం, జాయింట్ సెక్రటరీలుగా మండవ సుధాకర్, టి.నాగభూషణం, షమీఉద్దీన్ రజా, కోశాధికారిగా జి.సాయిరామ్‌ను ఎన్నుకున్నారు. పలువురిని కో ఆప్టెడ్ ఈసీ సభ్యులుగా ఎన్నుకున్నారు. అనంతరం జరిగిన బాధ్యతల స్వీకార కార్యక్రమంలో నాగమల్లేశ్వరరావు ఇన్‌స్టాలేషన్ అధికారిగా వ్యవహరించారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర స్థాయి నాయకులు పాల్గొన్నారు.

నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ప్రారంభం



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): బందరు రోడ్డులోని ఏ-కన్వెన్షన్ సెంటర్‌లో నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ఎగ్జిబిషన్ కమ్ సేల్ శుక్రవారం ప్రారంభమైంది. నిర్వాహకులు మాట్లాడుతూ ఈ నెల 8 తేదీ వరకు కొనసాగే ప్రదర్శనలో ఎన్నో రకాల సిల్క్, కాటన్ డిజైన్ వస్త్రాలు ఉంచామన్నారు. బంధేజ్, హ్యాండ్–బ్లాక్ ప్రింట్లు చీరలు కూడా ఉన్నాయని చెప్పారు.

టీడీపీ నాయకుల దౌర్జన్యం

బడ్డీకొట్లు తొలగింపు



పాయకాపురం(విజయవాడరూరల్): స్థానిక రాజీవ్‌నగర్ పార్కు వద్ద బడ్డీకొట్లు ఏర్పాటు చేసే విషయంలో అధికార టీడీపీకి చెందిన నాయకులు దౌర్జన్యం చేస్తున్నారు. వైఎస్సార్ సీపీకి చెందినవారి బడ్డీకొట్లను వీఎంసి అధికారులతో తొలగింపజేసి, అదేస్థలంలో అధికార టీడీపీ నాయకులు కొత్త బడ్డీకొట్లు ఏర్పాటు చేయడం గమనార్హం. కొన్నేళ్లుగా ఇక్కడ వైఎస్సార్ సీపీకి చెందిన రమణారెడ్డి బడ్డీకొట్టు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం టీడీపీ నాయకులు ఆ ప్రాంతానికి వచ్చి కొత్త వ్యక్తులకు బడ్డీకొట్లను ఏర్పాటు చేసే విషయంలో గొడవ పెట్టుకున్నారు. రమణారెడ్డితోపాటు మరో రెండు బడ్డీకొట్లను తొలగించి వారి మనుషులతో రెండు బడ్డీకొట్టు పెట్టించారు. ఈ సమస్యను వీఎంసి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండాపోయిందని బాధితులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొండపల్లికి చెందిన కళాబృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై శుక్రవారం సాయంత్రం అమ్మవారికి పంచహారతుల సేవ అనంతరం నృత్య ప్రదర్శన ప్రారంభమైంది. నృత్య కళాకారిణి దాము చరిష్మాదేవి పర్యవేక్షణలో 20కి పైగా కళాబృంద సభ్యులు పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన చేశారు. నృత్య ప్రదర్శన అనంతరం కళాబృందానికి అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు ప్రసాదాలను అందించారు.

నవమి వేడుకలకు ఆలయాలు ముస్తాబు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఈనెల ఆరో తేదీన నిర్వహించనున్న శ్రీరామనవమి వేడుకలకు నగరంలోని రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాలు ముస్తాబవుతున్నాయి. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో సీతారాములు కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. రామాలయాలను రంగులతో అందంగా తీర్చిదిద్దడంతోపాటు స్వామివారి కల్యాణోత్సవం కోసం చలువ పందిళ్లు వేస్తున్నారు. అన్నదానాలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

మధురానగర్‌లో..

మధురానగర్ పైపుల కంపెనీ సెంటర్‌లోని శ్రీకల్యాణ రామాలయంలో ఈనెల 6నుంచి 13వ తేదీ వరకు 55వ శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. చలువ పందిళ్లు, విద్యుద్దీపాలంకరణతోపాటు స్వాగతద్వారాలు ఏర్పాటు చేశారు. ఆలయం పరిధిలో ఇంటింటికీ వెళ్లి స్వామివారి కల్యాణోత్సవాలకు హాజరుకావాలని ఆహ్వానాలు పంచిపెట్టారు.

మాచవరంలో...

మాచవరంలో సీతారాముల కల్యాణోత్సవాలను తొమ్మిది రోజులపాటు ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేయనున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ముత్యాలంపాడులో..

ముత్యాలంపాడులోని శ్రీకోదండ రామాలయంలో శ్రీరామనవమిరోజున సామూహిక సీతారాముల కల్యాణం చేయనున్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. అదేవిధంగా శ్రీనగర్ కాలనీ ఒకటో లైనులో మల్యాద్రి ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.



మధురానగర్‌లోని శ్రీకల్యాణ రామాలయం

దేవీనగర్‌లో...

దేవీనగర్‌లోని రామాలయంలో సీతారాముల వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఆలయకమిటీ ఆధ్వర్యాన ఏర్పాట్లు సాగుతున్నాయి. భద్రాచలంలో సీతారాముల కల్యాణోత్సవం మాదిరిగా ఇక్కడ కూడా జరిపించేందుకు తగిన సన్నాహాలు చేస్తున్నారు.

ముత్యాలంపాడులో...

ముత్యాలంపాడు అలంకార్ బేకరీ సమీపంలో గుడిపాటి దత్తు ఆధ్వర్యాన 34వ సీతారాముల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.



విద్యుద్దీపాలతో ఏర్పాటు చేసిన స్వాగత ద్వారం



ముత్యాలంపాడులో వేసిన చలువ పందిరి

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఉమా

పాయకాపురం(విజయవాడరూరల్): తడిసిన ధాన్యం కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. విలేజి కుందావారి కండ్రిక సొసైటీలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ధాన్యం క్వింటాను ప్రభుత్వం రూ.2300లకు కొనుగోలు చేస్తోందన్నారు. దాళ్వాలో మంచి దిగుబడులు వచ్చాయన్నారు. కండ్రిక, పాతపాడు, పి.నైనవరం, అంబాపురం గ్రామాల్లో దాదాపు వెయ్యి టన్నుల ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. రైతులకు ధాన్యం అమ్మిన డబ్బులు వెంటనే చెల్లిస్తున్నట్లు వివరించారు. మిల్లర్లకు రవాణా చేయడానికి అవసరమైన లారీలు, గోనెసంచులను సిద్ధం చేసినట్లు చెప్పారు. రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ, వ్యవసాయాధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి లభించే కోర్సులు ప్రారంభించాలి



కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో కళాశాల విద్య డైరెక్టర్ డాక్టర్ నారాయణ భరత్ గుప్తా

మధురానగర్(విజయవాడసెంట్రల్): రాబోయే విద్యా సంవత్సరంలో ప్రతి డిగ్రీ కళాశాలలో అప్రెంటిషిప్ ఏంబాడెడ్ డిగ్రీ కోర్సులను ప్రారంభించాలని కళాశాల విద్య డైరెక్టర్ డాక్టర్ నారాయణ భరత్‌గుప్తా ఆదేశించారు. మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం కమిషనరేట్ ఆఫ్ కాలేజి ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో సెక్టార్ స్కిల్ కౌన్సిల్స్, ప్రిన్సిపాల్స్, అకడమిక్ కో ఆర్డినేటర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ విద్యార్థికి ఉపాధి లభించే కోర్సులను అందించాల్సిన బాధ్యత కళాశాలలపై ఉందన్నారు. కావున అప్రెంటిషిప్ ఏంబాడెడ్ డిగ్రీ కోర్సులను ప్రారంభించాలని సూచించారు. సెక్టార్ స్కిల్స్ కౌన్సిల్ సెంటర్ ఫర్ రీసెర్చ్ స్కీమ్స్ అండ్ పాలసీ వారు కోర్సుల వివరాలు ఫీజు గురించి వివరించారు. ఈ కోర్సుల ద్వారా ప్రతి విద్యార్థికి ఉపాధి లభిస్తుందన్నారు. 7 స్కిల్ కోర్సులను 2025–26 విద్యా సంవత్సరానికిగాను 47 ఐడెంటిఫై ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలలో ప్రారంభించడానికి ఓరియంటేషన్ ఇచ్చారు. ఇందులో భాగంగా 47 కళాశాలల ప్రిన్సిపాల్‌లు , అకడమిక్ కోఆర్డినేటర్లు వారి కళాశాలలో ఎలాంటి కోర్సులు ఆఫర్ చేయవచ్చు, వాటి ఫీజు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం డిమాండ్ ఉన్న ఉపాధి ఆధారిత బీఎఫ్ఐఎస్, ఎలక్ట్రానిక్స్, లాజిస్టిక్స్, లైఫ్ సైన్సెస్, రిటైల్ ఆపరేషన్స్, మేనేజ్‌మెంట్ ఎంటర్‌ప్రెన్యూర్ షిప్ కోర్సులను విద్యార్థులకు తెలియ చేయాలని సూచించారు. కళాశాల విద్య జాయింట్ డైరెక్టర్ కృష్ణ , ఎస్ఆర్ఆర్ అండ్ సివిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి, డాక్టర్ అప్పారావు, అధ్యాపకులు డాక్టర్ బాలసుబ్రమణ్యం, రమేష్, యుగంధర్, ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్, అకడమిక్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.


వైభవంగా శోభాయాత్ర



విద్యాధరపురంలో శోభాయాత్రలో భక్తులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): శ్రీవైష్ణవ మహా దివ్య క్షేత్ర సంఘం ఆధ్వర్యాన ఈ నెల 7 నుంచి ప్రారంభం కానున్న శ్రీవారి వైభవోత్సవ సహిత హనుమాన్ చాలీసా సమాపనోత్సవాలు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ శుక్రవారం నిర్వహించిన శోభాయాత్ర వైభవంగా జరిగింది. విద్యాధరపురంలోని అష్టాక్షరి రామాలయం నుంచి ప్రారంభమైన యాత్ర నాలుగు స్తంభాల సెంటర్, జోజినగర్, భవానీపురం స్వాతి రోడ్ మీదుగా ఉత్సవాలు జరిగే బబ్బూరి గ్రౌండ్‌కు చేరుకుంది. శ్రీవైష్ణవ మహా దివ్య క్షేత్ర సంఘం కార్యదర్శి దూపగుంట్ల శ్రీనివాసరావు జెండా ఊపి యాత్రను ప్రారంభించగా వందలాది మంది భక్తులు హనుమాన్ జెండాలను చేతబూని శోభాయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణానదీ తీరాన భవానీపురంలోని బబ్బూరి గ్రౌండ్‌లో ఈ నెల 7 నుంచి 13 వరకు హనుమాన్‌చాలీసా పారాయణ నిర్వహించనున్నట్లు తెలిపారు. పెనుమాకలో తమ క్షేత్రంలో జరిగిన చాలీసా అఖండ పారాయణ ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని ఈ ఉత్సవాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

క్యాబ్ డ్రైవర్ల పోరాటానికి సీఐటీయూ మద్దతు



మాట్లాడుతున్న ఫెడరేషన్ రాష్ట్ర కోశాధికారి కె.దుర్గారావు

మధురానగర్(విజయవాడసెంట్రల్): తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలంటూ ఓలా, ఉబర్ క్యాబ్ డ్రైవర్లు చేస్తున్న పోరాటానికి ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కోశాధికారి కె.దుర్గారావు, సిఐటియు ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సిహెచ్ శ్రీనివాస్, సంపూర్ణ మద్దతు ప్రకటించారు. బీఆర్టీఎస్ రోడ్డులోని నందూరి ప్రసాద రావుభవన్ సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ 30శాతం కమిషన్, పాస్‌ల పేరిట ప్రతిరోజూ డ్రైవర్ల జేబులు ఖాళీ అవుతున్నాయన్నారు. ఓలా, ఉబర్ సంస్థలు డ్రైవర్ల శ్రమను దోచుకుంటున్నాయన్నారు. రవాణా రంగంలో పనిచేస్తున్న క్యాబ్ ఇత ఆన్‌లైన్ సర్వీసుల కోసం ప్రభుత్వమే ఓ యాప్‌ను రూపొందించి ప్రైవేట్ సంస్థల కమిషన్ బాదుడు నుంచి డ్రైవర్లను రక్షించాలని కొన్నేళ్లుగా ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ డిమాండ్ చేస్తూనే ఉందని గుర్తుచేశారు. యాప్‌ను తీసుకువచ్చేందుకు కేంద్రం అంగీకరించడం శుభపరిణామన్నారు. వెంటనే ఆనిర్ణయాన్ని అమలుచేయాలని కోరారు. సమావేశంలో సెంట్రల్ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.హనుమంతరావు, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు నర్రా రాంప్రసాద్, గుంటూరు జోజి బాబు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరికి జైలు, 23మందికి జరిమానా

విజయవాడలీగల్: మద్యం సేవించి వాహనాలు నడిపిన 25మందికి శుక్రవారం రైల్వే కోర్టు న్యాయమూర్తి ఆర్‌వీఎస్ శర్మ జైలుశిక్ష, జరిమానా విధించారు. పోలీసుల కథనం మేరకు.. నగరంలో మూడవ ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపినవారిలో ఇద్దరికి న్యాయమూర్తి ఏడురోజులపాటు జైలుశిక్ష విధించారు. 23 మందికి ఒక్కొక్కరికి 10వేలు చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ఈసందర్భంగా కమిషనర్ రాజశేఖరబాబు మాట్లాడుతూ ప్రతిరోజు ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాలు నిర్వహించి, పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. వాహనచోదకులు ట్రాఫిక్ నియమనిబంధనలు, మోటార్ వాహన చట్టాలను పాటిస్తూ సురక్షితంగా ప్రయాణం చేయాలని కమిషనర్ సూచించారు.

పోలీస్ కమిషనరేట్ పరిధిలో నిషేధాజ్ఞలు

విజయవాడస్పోర్ట్స్: శాంతిభద్రతల పరిరక్షణ నిమిత్తం ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బీఎన్ఎస్ఎస్ 163 ప్రకారం నిషేధాజ్ఞలు విధించినట్లు జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాజా ఉత్తర్వుల ప్రకారం ఈనెల 4వతేదీ శుక్రవారం నుంచి మే 23వ తేదీ వరకు ఈ నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయని స్పష్టం చేశారు. ఇబ్రహీంపట్నం, భవానిపురం, వన్ టౌన్, టూటౌన్, సత్యనారాయణపురం, అజిత్ సింగ్‌నగర్, నున్న, గవర్నర్‌పేట, సూర్యారావుపేట, కృష్ణలంక, మాచవరం, గుణదల, పటమట పోలీస్ స్టేషన్‌ల పరిధిలో ఈ నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయన్నారు. ఈ ప్రాంతాల్లో ఐదుగురు, అంతకు మించి ఎక్కువ మంది జనం బహిరంగ ప్రదేశాలలో గుమిగూడరాదన్నారు. కర్రలు, రాళ్లు, ఇతర మారణాయుధాలు పట్టుకుని తిరగరాదని ఆదేశించారు. నిబంధనలను అతిక్రమించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసు కమిషనర్ హెచ్చరించారు.

జై భవానీ.. జైజై భవానీ

దుర్గమ్మకు విశేష సేవలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మకు శుక్రవారం పలు విశేష సేవలు జరిగాయి. సాయంత్రం అమ్మవారికి పంచహారతుల సేవ, పల్లకీ సేవ, దర్బారు సేవలు నిర్వహించగా పెద్ద ఎత్తున భక్తులు, ఉభయదాతలు పాల్గొని తరించారు. సాయంత్రం 6 గంటలకు అమ్మవారికి పంచహారతుల సేవ చేయగా పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలో అమ్మవారి ఉత్సవ మూర్తికి పూజా కార్యక్రమాలను నిర్వహించిన తర్వాత పల్లకీ సేవ జరిగింది. పల్లకీపై ఆది దంపతులు కొలువుదీరగా, మేళతాళాలు, మంగళవాయిద్యాల మధ్య అమ్మవారి ఆలయం చుట్టూ మూడు ప్రదక్షిణలు చేశారు. అనంతరం పూజా మండపంలో అమ్మవారికి దర్బారు సేవ జరిగింది. గత శనివారం నుంచి శుక్రవారం వరకు ఆలయంలో జరిగిన విశేష సేవలు, ఆదాయ, వ్యయాలను అమ్మవారికి ఆలయ అర్చకులు వివరించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు అన్ని క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జడ్జి ఆర్.వి.శర్మ

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని రైల్వే కోర్టు న్యాయమూర్తి, అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఆర్.వి.శర్మ అన్నారు. స్థానిక అజిత్‌సింగ్‌నగర్ ఆదిత్య కళాశాలలో శుక్రవారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జడ్జి శర్మ మాట్లాడుతూ మహిళలు, చిన్నారులు రక్షణ కోసం న్యాయ వ్యవస్థలో అనేక చట్టాలు ఉన్నాయన్నారు. వాటిని ప్రతిఒక్కరూ తెలుసుకోవలసిన అవసరం ఉందన్నారు. చిన్నారులపై జరుగుతున్న అకృత్యాలపై కఠినంగా శిక్షించడానికి పోక్సో చట్టం ఉందని, దోషులపై సత్వరం చర్యలు తీసుకోవడంతోపాటు బాధితులకు న్యాయం జరిగేవిధంగా ఉందన్నారు. మహిళలు చిన్నారులపై దాడులు, అకృత్యాలు జరగకుండా చూడవలసిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు రోజూ కొంత సమయం కేటాయిస్తూ వారికి కలిగే అనుమానాలను నివృత్తి చేయాలన్నారు. పిల్లలను అనునిత్యం గమనిస్తూ ఉండాలని సూచించారు కార్యక్రమంలో ప్రభుత్వ రైల్వే పోలీస్(జిఆర్‌పి)సీఐ జేవీ రమణ, ఆదిత్య కాలేజీ ప్రిన్సిపాల్, విద్యార్థులు పాల్గొన్నారు

సమయాన్ని వినియోగించుకుంటే విజయమే



విద్యార్థుల నృత్య ప్రదర్శన



ముఖ్యఅతిథి సుందరంను సత్కరిస్తున్న కళాశాల ప్రతినిధులు

ఘనంగా సిద్ధార్థ 50వ వార్షికోత్సవం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): సమయం చాలా విలువైందని దీన్ని వినియోగించుకుంటే విజయం వరిస్తుందని ది టైమ్స్ గ్రూప్ సీఈఓ శివకుమార్ సుందరం అన్నారు. పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల 50వ వార్షికోత్సవాన్ని సిద్ధార్థ ఆడిటోరియంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఈసందర్భంగా సుందరం మాట్లాడుతూ తాను సిద్ధార్థ కళాశాల పూర్వ విద్యార్థినని చెప్పారు. జీవితంపై ప్రతి ఒక్కరికి స్పష్టమైన దృక్పథం ఉండాలని, దీనికి నైపుణ్యం తోడైతే అపారమైన ఉపాధి అవకాశాలు వెతుక్కుంటూ వస్తాయని చెప్పారు. కాలేజీ ప్రిన్సిపాల్ ఎం.రమేష్ మాట్లాడుతూ సిద్ధార్థ అకాడమీ 50 సంవత్సరాల సుదీర్ఘ కాలంలో 18 విద్యాసంస్థలను నిర్వహిస్తోందన్నారు. అనంతరం శివకుమార్ సుందరంను సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రటరీ నిమ్మగడ్డ లలితప్రసాద్, కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, డీన్ రాజేష్ సి.జంపాల సత్కరించారు.

అధ్యాపకులకు బహుమతులు..

సభ అనంతరం బెస్ట్ విభాగం పురస్కారాన్ని కంప్యూటర్ విభాగాధిపతి డాక్టర్ టీఎస్.రవికిరణ్, బెస్ట్ సపోర్టింగ్ స్టాఫ్ అవార్డులను సుధీర్, కృష్ణారావులకు, ఉత్తమ అధ్యాపకురాలు అవార్డును ఆంగ్ల శాఖాధిపతి శ్రీలతకు సుందరం అందజేసి అభినందించారు. విద్యార్థినులు ప్రదర్శించిన శివోహం, శ్రీనివాస కల్యాణం, శాస్త్రీయ నృత్యాలు అందరినీ అలరించాయి. కళాశాల అధ్యాపకులతోపాటుగా విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు ఉపసంహరించాలి : సీపీఎం



కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వ తీరును నిరసిస్తూ ర్యాలీ చేస్తున్న సీపీఎం నాయకులు, ముస్లింలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ బోర్డు చట్ట సవరణ బిల్లును వెంటనే ఉపసంహరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్‌సీహెచ్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ స్థానిక అజిత్‌సింగ్‌నగర్ మదీనా మసీదు వద్ద శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈసందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్రంలో మోడీ మతతత్వ విధానాల్ని అనుసరిస్తూ వక్ఫ్ బోర్డు ఆస్తులను కొల్లగొటేందుకు చట్ట సవరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టారన్నారు. మోడీ ప్రభుత్వం లవ్ జిహాద్, ఘర్‌వాపసి, కామన్ సివిల్ కోడ్, మసీదులపై దాడులు, 370 ఆర్టికల్ రద్దు వంటి దుర్మార్గ చర్యల్ని చేపట్టిందని విమర్శించారు. తాజాగా ముస్లింల వక్ఫ్ బోర్డు ఆస్తులపై ఆజమాయిషీ చేసేందుకు రాజ్యాంగ నిబంధనలు ఉల్లంఘించి ఈ చట్టంలో సవరణలు తెచ్చారన్నారు. ఈ బిల్లు ముస్లిం మైనారిటీల హక్కులను కాలరాస్తోందని మండిపడ్డారు. ముస్లింల ధార్మిక, సామాజిక, సాంస్కృతిక సంస్థలపై దాడి చేయడానికే ఈ బిల్లును తెచ్చారన్నారు. లౌకిక పార్టీలని చెబుతున్న తెలుగు దేశం ,జనసేన పార్టీలు వక్ఫ్ బోర్డు చట్ట సవరణ బిల్లుకు మద్దతు ఇవ్వడం సిగ్గుచేటన్నారు. ఈ దుర్మార్గ సవరణలకు వ్యతిరేకంగా అన్ని లౌకిక పార్టీలను కలుపుకుని పోరాడతామని తెలిపారు. సీపీఎం సెంట్రల్ సిటీ కార్యదర్శి బి.రమణారావు మాట్లాడుతూ ఈచట్టం సవరణలు సుప్రీంకోర్టు తీర్పులను ఉల్లంఘిస్తున్నాయన్నారు. హిందుత్వ మనువాదాలకు వ్యతిరేకంగా తమపార్టీ పోరాడుతోందన్నారు. రాబోయే కాలంలో విశాల ఐక్య వేదికలు నిర్మించి మతతత్వానికి వ్యతిరేకంగా పోరాడతామని తెలిపారు. కార్యక్రమానికి ఆ పార్టీ సెంట్రల్ సిటీ కార్యదర్శి వర్గ సభ్యులు కె.దుర్గారావు అధ్యక్షత వహించగా, నగర కమిటీ సభ్యులు ఎస్.కె నిజాముద్దీన్, ఎస్‌కె రసూల్, ఎం.నాగార్జున, ఎ.పున్నారావు, జి.వెంకటేశ్వరరావు(కొండ), కె మురహరి, సీహెచ్ నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటుకు డిమాండ్



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆటో, ట్యాక్సీ కార్మికుల కోసం కూటమి పాలకులు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ డిమాండ్ చేశారు. గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం విజయ టాక్సీ సొసైటీ వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం జరిగింది. సమావేశానికి యూనియన్ కార్యదర్శి అబ్దుల్ ఖుద్దూస్ అధ్యక్షత వహించగా, శంకర్ మాట్లాడుతూ రవాణా రంగంలోని కార్మికులకు భద్రత, ప్రమాద బీమా కూడా లేదన్నారు. గత ప్రభుత్వంలో అమలు అయిన వాహనమిత్ర సైతం ఆగిపోయిందన్నారు. ఇన్స్యూరెన్స్, పీఎఫ్ తదితర సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం యూనియన్ గౌరవ అధ్యక్షులుగా వజ్జే పద్మలత, అధ్యక్షుడిగా దోనే పూడి శంకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు మన్యం సుబ్బయ్య, నాయకులు బుద్ధ సాంబశివరావు, కడియాల సాంబశివరావు కోశాధికారి వాసు, సింహాచలం, సాయి, చంటి పాల్గొన్నారు.

రోడ్లపై నిలిచిన వర్షపు నీరు



శ్రీనగర్ కాలనీ మూడో లైన్‌లో నిలిచిన వర్షపునీరు



మధురానగర్ ఆర్‌యూబీ వద్ద నిలిచిన వర్షపునీరు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్‌లో గురువారం రాత్రి కురిసిన వర్షానికి పలుచోట్ల వర్షపునీరు రోడ్లపైనే నిలిచిపోయింది. మధురానగర్ ఆర్‌యూబీ సమీపంలోని సర్వీసు రోడ్డు మలుపు, శ్రీనగర్‌కాలనీ మూడో రోడ్డు తదితర ప్రాంతాలలో వర్షపునీరు రోడ్డుపైనే నిలిచింది. ఇక్కడ వర్షపునీరు బయటకు పోయే మార్గంలేక రోడ్డుపైనే నిలిచిపోవడంతో రాకపోకలకు వాహనచోదకులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. దావు బుచ్చయ్యకాలనీలో వాటర్‌పైపులైన్ పనుల కోసం తవ్విన రోడ్లు , శ్రీనగర్ కాలనీలో యూజీడీ పనుల కోసం తవ్విన రోడ్లు వర్షపు నీటికి బురదగా మారాయి. బురదమయమైన ఈరోడ్లపై నడిస్తూ పలువురు జారిపడిపోయారు. తవ్విన వెంటనే రోడ్లను సరిచేయకపోయినందునే ఇలా ఇబ్బందులు పడాల్సి వస్తోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. అధికారులు స్పందించి వర్షపునీరు రోడ్డుపై నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలని, ఆయా పనుల కోసం తవ్విన రోడ్డును వెంటనే సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.